కథ

# అమ్మ

– అరుణామోహన

"అలాంటి ఫార్మాలిటీస్ ఏమీ పెట్టుకోకండి. మేము ఇంటికి వెళతాము. రేపు బ్యాంక్‌లో చాలా పని ఉంది," గదిలోకి వచ్చి నిద్రపోతున్న పాపను ఎత్తుకుంటూ అన్నాడు మనోహర్.

కూతురికి జడ వేసి తలలో పూలు తురమబోతూ అల్లుడిని చూసి లేచి నిలబడింది శాంతమ్మ

"ఈ ఒక్క రాత్రి ఉంటే బాగుంటుందని మా ఆశ బాబూ!" పూలదండ వైపు చూస్తూ అల్లుడితో మెల్లగాఅంది ఆమె.

"ఊహు! వెళ్ళాలి. చాలా పనులున్నాయి" పాపను భుజం మీద వేసుకుని జోకొడుతూ బయటికి వచ్చాడు.

వెళ్ళి వస్తానని తల్లికి కళ్ళతోనే చెప్పి అతని వెనుక నడిచింది ధవళ. స్కూటర్ వద్దకు వెళ్ళి జేబులో నుంచి తాళాలు బయటకు తీశాడతను. చప్పున అతని దగ్గరకు వచ్చి పాపను అతనిభుజం మీద నుంచి తీసుకుని తన భుజం మీదకు వేసుకుంది ధవళ. ఒక్క క్షణం ఆమె వైపు చిత్రంగా చూసి చూపులు మరల్చుకున్నాడతను. మనోహర్ తల్లి, ధవళ తండ్రి గబగబా స్కూటర్ వద్దకు వచ్చారు.

"ఈ రాత్రికి ఇక్కడ ఉండండి బాబూ! వాళ్ళు ఎంతగానో ప్రాధేయపడుతున్నారు" అన్నది మనోహర్ తల్లి.

"అల్లుడుగారూ!" ధవళ తండ్రి మనోహర్ చేతులు పట్టుకున్నాడు.

ముఖంలోకి శాంతాన్ని తెచ్చుకుంటూ మామగారి వైపు చూశాడతను.

"మా బ్యాంకు తాళం చెవులు ఇంట్లోనే ఉన్నాయి. రేపు తప్పనిసరిగా బ్యాంకుకు వెళ్ళాలి. బట్టలు కూడా తెచ్చుకోలేదు కదా" సౌమ్యంగా, ఖచ్చితంగా చెప్పాడు.

మారు మాట్లాడలేకపోయాడు ధవళ తండ్రి.

"రేపు ఉదయం ఫస్టు బస్సుకు బయల్దేరి మన ఊరు వెళతాను బాబూ" మనోహర్ తల్లి అంది.

"పది రోజులు ఉండి వెళ్ళామ్మా" తల్లి వంక ఆర్తిగా చూస్తూ అన్నాడు.

"ఇల్లూ, వాకిలీ వదిలి వచ్చి అపుడే వారం రోజులైంది. పాలేరుకు బాధ్యత అప్పజెప్పి వచ్చాను. రేపు వెళతానురా" అందామె.

"సరే!" తల్లితో చెప్పి స్కూటర్ స్టార్ట్ చేశాడు.

"ధవళా! పాప జాగ్రత్తమ్మా! అబ్బాయికి రెండు రోజులు సెలవులు వచ్చినప్పుడు తప్పకుండా మన ఊరు రండి. నీ జీవితం ఆనందంగా గడవాలని కోరుకుంటున్నాను." కోడలి వద్దకు వచ్చి పాప అరచేతిలో ముద్దు పెట్టుకుంటూ అన్నదామె.

అత్తగారి వంక, తండ్రి వంక చిరునవ్వుతో చూసి వెనుక సీటు మీద కూర్చుని పాపను ఒళ్ళో పడుకోబెట్టుకుంది ధవళ. గుమ్మం దగ్గర నిలబడి కళ్ళు ఒత్తుకుంటున్న తల్లి, ప్రక్కనే తమ్ముడు కనిపించి ధవళ కళ్ళు తడి అయ్యాయి.

ఐదునిమిషాల ప్రయాణం తర్వాత ఒక ఇంటి ముందు స్కూటర్ ఆపాడు. స్కూటర్ మీద నుండి దిగింది ధవళ. గేటు తీసి స్కూటర్‌ను ఇంటి ఆవరణలోకి తీసుకెళ్ళి లాక్ చేశాడు. ఇంటి తాళం తీసి పాపను ఇవ్వమన్నట్లుగా ధవళ వైపు చూసి చేతులు చూపాడు. అతని వంక ఒక్క క్షణం చూసి పాపతో పాటు లోపలికి అడుగుపెట్టింది. ఆమెను దాటుకుంటూ లోపలి గదిలోకి వెళ్ళాడతను. పాప ఆదమరచి నిద్రపోతోంది. ఉయ్యాల ఎక్కడ? హాలులో ఒక్క నిమిషం సంశయంగా నిలబడి చుట్టూ చూసింది.

మెల్లగా అతను వెళ్ళిన గదిలోకి అడుగు పెట్టింది. డబుల్‌కాట్స్ పక్కన ఉయ్యాలలో పాపను పడుకోబెట్టి దుప్పటి కప్పి ఫ్యాన్ వేసింది. బట్టలు మార్చుకోబోయి ఆమె గదిలోకి రావడం చూసి ఆగిపోయాడతను. మౌనంగా ముందు గదిలోకి వెళ్ళి నిలబడిందామె.

అతను స్నానం చేసి వచ్చి సోఫాలో కూర్చుని పేపర్ తీసుకుని చదవసాగాడు. బాత్‌రూమ్‌లోకి నడిచి కాళ్ళు చేతులు కడుక్కుంది. మెల్లగా అతని దగ్గరకు వెళ్ళి నిలబడింది. తలెత్తి చూశాడతను.

"పాప రాత్రిపూట నిద్రలేచి ఏడిస్తే పాలు..." ఆగిపోయింది.

"ఫ్రిజ్‌లో ఉన్నాయి" చెప్పి మళ్ళీ పేపర్ చదవడంలో మునిగిపోయాడు.

"పాలసీసా"

"అరె! మీ ఇంటి దగ్గర మరచిపోయాను. ఇంకో బాటిల్ ఉందనుకుంటాను. చూస్తాను" చప్పున లేచి కిచెన్‌లోకి వెళ్ళాడతను. అతని వెనుకే వెళ్ళింది ధవళ.

ఆల్మైరాలో రెండు నిమిషాలు వెతికి బాటిల్ తీసిచ్చాడు. బాటిల్ శుభ్రం చేసి బెడ్‌రూమ్‌లోకి వెళ్ళింది. ఉయ్యాల దగ్గరకు వెళ్ళి పాప దుప్పటి సరిచేసి మంచం మీద పడుకుంది. ఆమె పడుకొని పక్కకు తిరగడంతో అప్పటివరకు చీరమాటున ఉన్న మంగళసూత్రాలు బయటికి కనిపించాయి. పచ్చగా మెరిసిపోతున్న మంగళ సూత్రాలను అప్రయత్నంగా చేతిలోకి తీసుకుంది.

'ఉదయం 9 గంటల 32 నిమిషాలకు ఈ మంగళసూత్రాలు తన మెడలోకి వచ్చాయి' అసంకల్పితంగా వాటిని కళ్ళకద్దుకుని కుడి చేతిలో గట్టిగా పట్టుకుంది. చేతికున్న వాచిలో టైము చూసింది. రాత్రి 10 గంటలు దాటింది. మరో ఐదు నిమిషాలలో గాఢనిద్రలోకి జారిపోయిందామె.

పేపర్ చదివి మరో గంట తర్వాత బెడ్‌రూమ్‌లోకి వచ్చాడతను. పాప బుగ్గలను నిమిరి మంచం వైపు చూపు మరల్చాడు. మంగళసూత్రాలను చేతితో పట్టుకొని ప్రశాంతంగా నిద్రపోతోంది ధవళ. ఆమె వంక-ఒక నిమిషం చూసి మొహం పక్కకు తిప్పుకున్నాడు. దిండు తీసుకుని ముందు గదిలోకి వెళ్ళబోయి ఉయ్యాల వైపు చూసి ఆ ప్రయత్నం విరమించుకున్నాడు. కాస్సేపు మౌనంగా నిలబడి ట్యూబ్‌లైట్ వేసి మంచం మీద ఒక ప్రక్కగా పడుకున్నాడు. అర్థరాత్రి లైట్ వెలుగుకు మెలకువ వచ్చి కళ్ళు తెరిచి చూశాడతను. పాపకు పాలు పడుతోంది ధవళ. పాలు పట్టాక పాప పెదవులను తడి చేతితో తుడిచి ఉయ్యాల ఊపుతూ కూర్చుందామె. పాప నిద్రపోయిన తర్వాత ఆమె లేవడం చూసి కళ్ళు మూసుకున్నాడు.

ఉదయం ఆరుగంటలకు

తల స్నానం చేసి పూజా పీఠం వద్ద ఉన్న కుంకుమనొసట దిద్దుకుని కనులు మూసి రెండు నిమిషాలు భగవంతుని ప్రార్థించింది.

పాపాయి లేచి ఏడుస్తూంటే పాలు పట్టింది.

బ్యాంకుకు సంబంధించిన కాగితాలు చూసుకుంటున్న మనోహర్ దగ్గరకు వెళ్ళి అతని ఎదురుగా ఉన్న టీపాయ్ మీద కాఫీ కప్పు పెట్టింది.

అలికిడికి తలెత్తి ఆమె వైపు చూసి ముఖం చిట్లించాడతను. "హేమ చీరెలు ఎవరైనా కట్టుకోవడం నాకిష్టం లేదు" కాగితాలు పక్కన పెట్టి కాఫీ త్రాగకుండా స్నానానికి వెళ్ళాడతను.

రెండు నిమిషాలు మౌనంగా నిలబడిందామె. తను కట్టుకున్న చీర వైపు చూసింది. రాత్రి బట్టలు తెచ్చుకోవడం మరిచిపోయింది. సూర్యోదయానికి ముందే స్నానం చేసి తన ఇష్టదైవాన్ని పూజించడం చిన్నప్పటినుంచీ అలవాటు. బీరువా తీసి ఆమె చీర కట్టుకుంది తను. అతని భార్యగా, పాపకు తల్లిగా అడుగుపెట్టిన తనకు అవసరమైతే ఈ ఇంట్లో వస్తువులు వాడుకునే హక్కు లేదా? అతను ఎన్ని గంటలకు బ్యాంకుకు వెళతాడో తెలియదు. వంట చేద్దామని ఫ్రిజ్‌లోనుండి కూరగాయలు తీసి కోస్తూ ఉండగా ధవళ తమ్ముడు మురళి వచ్చాడు.

"అక్కా! పాపాయి పాలసీసా అమ్మ ఇపుడు మనింట్లో చూసి వెంటనే నన్ను పంపింది. రాత్రి నువ్వు బట్టలు తెచ్చుకోవడం మరిచిపోయావు కదా! ఇవిగో" పాలసీసా, బట్టల బ్యాగ్ టేబిల్ మీద పెడుతూ అన్నాడతను.

అవుడే అక్కడికి వచ్చిన మనోహర్ వైపు చూసిందామె.

బావగారి వైపు చూసి పలకరింపుగా నవ్వి పాపాయిని కాస్సేపు ఎత్తుకుని ఆడించి వెళ్ళిపోయాడతను, ట్యూషన్‌కు వెళ్ళాలంటూ.

"సారీ! నీ బట్టలు తెచ్చుకోలేదన్న విషయం నాకు తెలియదు" బెడ్‌రూమ్‌లోకి వెళ్ళి చీర మార్చుకుని వచ్చిన ధవళ వైపు చూస్తూ అన్నాడతను.

నవ్వి ఫర్వాలేదన్నట్లు అతని వైపు చూసింది.

భోజనం చేసి అతను బ్యాంకుకు వెళ్ళాక పాపాయికి స్నానం చేయించి కొద్దిగా అన్నం పెట్టి నిద్ర పుచ్చింది. కళ్ళు విశాలంగా చేసి ఆమెను వింతగా చూస్తూ నిద్రపోయింది పాపాయి.

అన్నిటి మీదా దుమ్ము తుడిచి, మంచం మీద దుప్పటి, దిండు గలీబులు మార్చుదామని తీసింది.

దిండు కింద ఫోటో కనిపించింది. ప్రపంచంలోని సంతోషమంతా తమదే అన్నట్లు హాయిగా, ఆనందంగా ఉన్నారు మనోహర్, ఆమె అందులో. హేమ కాబోలు ఆమె పేరు. మహలక్ష్మిలా కళకళలాడుతూ ఉంది. పాప అంతా ఆమె పోలికే అనుకుంది.

ఫోటో తిరిగి దిండు కింద పెట్టింది. అన్నీ సర్ది ఇల్లు ఊడ్చి రెండుసార్లు తడిబట్టతో తుడిచింది.

"అమ్మగోరూ! తవర్నేనా అయ్యగారు నిన్న మనువాడింది? ఇయ్యాల శాలా ఆలీశం అయిందమ్మా ఎంతసేపు! సిటికెలో సేస్తాను పని" అంటూ పాప దగ్గరకు వెళ్ళి ఎత్తుకుంది, పనిమనిషి కాబోలు. అలవాటైన మనిషి కావడంతో కిలకిలా నవ్వింది పాప.

గిన్నెలు తోముతూ గలగలా మాట్లాడుతోంది పనిమనిషి.

"అయ్యగోరు శానా మంచోరమ్మా! అమ్మగోరితో ఎంత సరదాగా ఉండేవారని! సిలకా గోరింకల్లాగా ఉండేవోరు. ఆళ్ళని సూత్తే అందరికీ ముచ్చటగా ఉండేది. మాయదారి బగమంతుడు కానుపులో ఆమె పాణం తీసికెళ్ళిండు. అమ్మగారి తల్లి వచ్చి పిల్లను తీసికెళ్తానన్నా అయ్యగోరు ఒప్పుకోలేదు. పసి గుడ్డును తనే పెంచాడమ్మా! ఏడెనిమిది నెలలైంది పాప పుట్టి. అయ్యగారి అమ్మ వచ్చి మళ్ళీ పెళ్ళి వేసుకోమని ఒకటే గొడవ. ఈన ఒప్పుకోలేదుగా! ఎట్టయితేనేమి ఆ అమ్మ వారం రోజులు ఈడ ఉండి మిమ్మల్ని మనువాడటానికి అయ్యగోరితో ఊఁ అనిపించింది. సక్కగా ఉన్నావు తల్లీ. మారు మనువు అన్న మాటే గాని అయ్యగారు శాలా మంచోరు"

పని చేస్తున్నంత సేపు ఆమె చెబుతున్న మాటలను చిరునవ్వుతో వింటోంది ధవళ.

గిన్నెలు తోమి, బట్టలు ఉతికి పనిమనిషి వెళ్ళాక పుస్తకాల షెల్ఫ్ నీట్‌గా సర్దింది. ఎపుడు సాయంత్రం అయిందో కూడా గమనించలేదు. పాప ఏడుస్తూంటే సముదాయిస్తూ వంట పూర్తి చేసింది. పాపకు స్నానం చేయించి, అన్నం పెడుతుండగా అతను వచ్చాడు.

స్నానం చేసి పాపను ఆడిస్తూ కూర్చున్నాడతను.

"కాఫీ ఇవ్వనా లేక భోజనం చేస్తారా" అడిగింది.

"భోంచేస్తాను. బాగా ఆకలిగా ఉంది" లేచాడు మనోహర్.

చప్పున వెళ్ళి వడ్డించింది.

"నువ్వూ పెట్టుకో" అన్నాడు.

తల్లి గుర్తుకు వచ్చి కళ్ళు తడి అవడంతో తల ప్రక్కకు తిప్పుకుంది.

మర్నాడు మధ్యాహ్నం-

బీరువాలో బట్టలు చిందరవందరగా ఉన్నాయని పాప నిద్రపోతున్నప్పుడు తీరిగ్గా బట్టలు సర్దింది.

బీరువాలో కొన్ని లెటర్లు కనిపించాయి. ఫ్రమ్ హేమ అని వ్రాసి ఉండడం చూసి వెంటనే అవి మళ్ళీ అక్కడే పెట్టింది. అతని పెళ్ళి ఆల్బమ్ మాత్రం చూడకుండా ఉండలేకపోయింది. మధుపర్కాలతో చూడముచ్చటగా ఉన్నారు మనోహర్, హేమ. పెళ్ళిఫోటోల తర్వాత రిసెప్షన్ ఫోటోలు, ఆ తర్వాత వాళ్ళ హనీమూన్ ఫోటోలు. వారిద్దరి ముఖాలలో అంతులేని ఆనందం, చలాకీతనం.

ఎంతసేపు ఆ ఫోటోలను చూసిందో తెలియదు.

పాప నిద్ర లేచి ఆకలికి ఏడవడంతో ఆల్బమ్ బీరువాలో పెట్టి పాపవైపు నడిచింది.

ఇంటి పనులు చేసుకోవడంలో, పాపాయి ఆలనా పాలనా చూసుకోవడంలో టైము తెలియడం లేదు..



వారం రోజులు గడిచాయి. అమ్మా నాన్నలను చూడాలనిపిస్తోంది ఆమెకు. పాప బాగానే అలవాటైంది.

ధవళ తమ్ముడు రోజు విడిచి రోజు వచ్చి కాస్సేపుండి వెళుతున్నాడు. "అమ్మ నిన్ను చూడాలంటుందక్కా" అన్నాడు ఒక రోజున.

మర్నాడు మనోహర్ బ్యాంకుకు వెళ్ళబోతుండగా అన్నది "అమ్మను చూడాలని ఉంది. వెళ్ళి సాయంత్రానికి వచ్చేస్తాను."

"మరి పాప..." అన్నాడతను.

విచిత్రంగా చూసింది అతనివైపు. "పాపను తీసుకునే వెళతాను"

మౌనంగా వెళ్ళిపోయాడతను.

అతను వెళ్ళిన వైపే చూస్తూండిపోయింది.

అవేళ త్వరగా ఇంటికి వచ్చాడతను. "ఎంతసేపైంది వచ్చి?" ఇంట్లోకి వస్తూనే అడిగాడు. "ఎక్కడి నుండి వచ్చి?" ప్రశ్నార్థకంగా చూసింది.

"మీ అమ్మా వాళ్ళ దగ్గరకు వెళతానన్నావు కదా!"

"మీరు వెళ్ళమని చెప్పలేదు కదా!" ఆ విషయం గురించి అంతకు మించి మాట్లాడడానికి ఇష్టం అనిపించక కిచెన్‌లోకి వెళ్ళింది.

స్నానం చేసి డ్రస్ చేసుకుని వచ్చి సోఫాలో కూర్చుంటూ అన్నాడు, "మీ అమ్మా వాళ్ళదగ్గరకు ఇపుడు వెళదామా మరి! ఒక గంటలో వచ్చేద్దాం"

ధవళ ముఖంలో వెలుగు. అతనికి కాఫీ ఇచ్చి చకచకా పాపకు ఫ్రాకు మార్చింది.

స్కూటర్ ఆగిన శబ్దం విన్న శాంతమ్మ గబగబా బయటికి వచ్చి పాపను ఆప్యాయంగా ఎత్తుకుని బుగ్గలు పుణికింది. ధవళ చేయి పట్టుకుని లోపలికి తీసుకు వెళ్ళింది. అల్లుడి గారి వైపు చూసి పలకరింపుగా నవ్వింది.

"నాలుగు రోజుల నుండి నిన్ను చూడాలనిపిస్తోంది. నేనే మీ ఇంటికి వద్దామనుకుని రాలేదు" అన్నదామె.

తనతో ఉత్సాహంగా మాట్లాడుతున్న కూతురి వైపు పరిశీలనగా చూసిందామె.

"ధవళా! అల్లుడు గారు..." ఎలా అడగాలో తెలియక ఆగిపోయిందామె!

"చాలా మంచి వారమ్మా! బాగా చూసుకుంటున్నారు" చిరునవ్వుతో అంది ధవళ.

ఆమె తల్లి దీర్ఘంగా నిట్టూర్చింది.

ఫ్యాక్టరీ నుండి ఇంటికి వచ్చిన తండ్రిని, ట్యూషన్ నుండి వచ్చిన తమ్ముడు మురళిని పలకరించి కాస్సేపు కూర్చుని లేచింది.

పొడి పొడిగా వాళ్ళతో రెండు మాటలు మాట్లాడి మౌనంగా ఊరకుండి పోయిన అతను కూడా లేచాడు. భోజనం చేసి వెళ్ళమని తల్లి అంటున్నప్పటికీ, వంట చేసి వచ్చానంటూ బయటికి నడిచింది ధవళ. పాప నెత్తుకుని వెనుకే నడిచాడతను, కళ్ళతోనే వాళ్ళ వద్ద సెలవు తీసుకుని.

మర్నాడు సాయంత్రం మనోహర్ బ్యాంక్ నుండి వచ్చేటప్పటికి చాలా ఆలశ్యమైంది. ఏవో కవర్లు తీసుకు వచ్చి మంచం మీద పెట్టాడు.

చాలా సేపయ్యాక అవి అలాగే ఉండడం చూసి, హాలులో కింద కూర్చుని పాపకు పాలు పడుతూన్న ఆమె దగ్గరకు వచ్చాడతను.

"నీకు, పాపకు బట్టలు తెచ్చాను. బాగున్నాయా?"

నిదానంగా తల ఎత్తి అతని వైపు చూసింది.

"ఇష్టంతో సంతోషంగా తెచ్చిన ఏ వస్తువు అయినా బాగుంటుంది."

మొదటి సారిగా ఆమె కళ్ళలోకి చూశాడతను.

ఆమె కళ్ళు స్వచ్ఛంగా ఉన్నాయి.

తల విదిలించి బెడ్ రూమ్‌లోకి వెళ్ళాడు.

ఎందుకు తనింత భయ పడుతున్నాడు? ఆమెను ఎందుకు భార్యలా చూడలేకపోతున్నాడు? అయిష్టంతో, అపనమ్మకంతో చేసుకున్న రెండో పెళ్ళి.

దిండు క్రింద నుండి హేమ ఫోటో తీసి గుండెలకు హత్తుకున్నాడతను. అతని కళ్ళు వర్షిస్తున్నాయి. తలగడ తడిసిపోయింది. నిద్రపోయిన పాపను తీసుకు వచ్చి ఉయ్యాలలో పడుకోబెట్టింది ధవళ.

లైటు తీయబోతూ అతని వైపు చూసింది.

మనోహర్ ముఖం కన్నీటితో చారికలు కట్టింది. గుండెల మీద ఆమె ఫోటో. ఫోటోను అలాగే ఉంచి నిద్రపోతున్న అతనికి దుప్పటి కప్పింది.

"హేమా! నన్ను వదిలి ఎక్కడికీ వెళ్ళవు కదూ! హేమా! హేమా!"

ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది ధవళ. నిద్రలోనే ఏడుస్తూ తనను హత్తుకున్నాడతను. అతని చేతులు ఆమెను ఇంకా ఇంకా దగ్గరకు లాక్కుంటున్నాయి. ఏడుపులోనే ఆమె నుదుటి మీద ముద్దుపెడుతున్నాడు.

భర్త తొలి స్పర్శ, అది!

"ఏమండి" అతని భుజాలు పట్టుకుని గట్టిగా కుదిపింది.

అతను కళ్ళు తెరిచాడు. ఒక్కనిమిషం ఆమెవైపు ఆమోమయంగా చూసి దూరంగా జరిగాడు. లేచి మంచి నీళ్ళు తాగి అటువైపు తిరిగి పడు కున్నాడు. మర్నాడు లేచాక ఆమెకు ముఖం చూపించలేక పోయాడతను. చాలా సిగ్గుగా, బాధగా అనిపిస్తోంది మనోహర్‌కు. హేమ గుర్తుకు వస్తోంది అతనికి. ఆమెతో పంచుకున్న అనుభూతులు అనుక్షణం వెంటాడు తున్నాయి.

ధవళ పెళ్ళయి ఐదు నెలలు గడిచాయి.

పాపకు ఏడాది నిండుతోంది. బొద్దుగా, చలాకీగా ఉంటూ పాప అల్లరి చేస్తోంటే పట్టలేకపోతోంది ధవళ.

పాప అల్లరి గురించి రెండు, మూడుసార్లు అతను బ్యాంకు నుండి వచ్చి కాఫీ త్రాగుతున్నపుడో, భోజనం చేస్తున్నపుడో మురిపెంగా, ముద్దుగా చెప్ప బోయింది ధవళ. ఆమె వైపు సూటిగా చూసి తల తిప్పుకునేవాడతను.

పాపను అపురూపంగా చూసుకుంటాడతను. ధవళ గమనిస్తూనే ఉంది. తనంటే అతనికి ఎందుకంత నిరాదరణ? ఆ ప్రశ్నకు సమాధానం దొరకలేదామెకు.

"దీక్షా! నా బంగారు తల్లీ" పని చేసుకుంటూ మధ్యలో గుర్తు వచ్చి పాప నిద్రపోతుంటేనో, ఆడు కుంటుంటేనో వచ్చి చటుక్కున ముద్దుపెట్టుకుంటుంది ధవళ.

ధవళ ఇలా చేయడం గమనించిన మనోహర్‌కు వింతగా అనిపించేది కాబోలు, ఆ దృశ్యాన్ని చాలా చిత్రంగా చూసేవాడు.

మనోహర్ తల్లి పల్లె నుండి వచ్చింది. పాప ధవళకు బాగా మాలిమి అవడం చూసి సంతోషించింది. పొలం పనులు దగ్గర ఉండి చేయించాలంటూ రెండు రోజులుండి తిరిగి వెళ్ళిందామె.

ధవళకు భర్తతో సాన్నిహిత్యం, చనువు లేదన్న విషయాన్ని గమనించింది ధవళ తల్లి ఒక్కర్తే, నెలకు రెండు, మూడు సార్లు కూతురిని కలిసినపుడు ధవళ ఏమీ చెప్పకపోయినా ఆమె గ్రహిస్తూనే ఉంది. రోజులు గడుస్తూ ఉన్నాయి.

శనివారం సాయంత్రం 5 గంటలు దాటింది.

బ్యాంక్‌లో పెండింగ్ వర్క్ పూర్తిచేసుకుని బయటికి వచ్చి స్కూటర్ స్టార్ట్ చేయబోతున్న మనోహర్, కాస్త పక్కగా నిలబడి అత్తగారు తనవైపే చూడడం గమనించాడు.

ప్రశ్నార్థకంగా చూస్తూ ఆమె వైపు నడిచాడు.

"గుడి నుండి తిరిగి వెళుతూ మీ స్కూటర్ ఇక్కడే ఉండడం చూసి మీరు బ్యాంక్‌లోనే ఉన్నారనుకుని ఆగాను. మీతో మాట్లాడాలి. అలా గుళ్ళోకి వెళదామా బాబూ!"

"పదండి" వింతగా రెండుక్షణాలు చూసి అన్నాడు.

పక్కనే ఉన్న వేంకటేశ్వరస్వామి కోవెల వైపు నడిచారిద్దరూ.

"పాప బాగుందా బాబూ! ధవళ ఏం చేస్తోంది? చూసి రెండు వారాల పైనే అయింది" అన్నదామె గుడి ఆవరణలో చెట్టు కింద కూర్చుంటూ. "బాగానే ఉన్నారు"

కొద్దిసేపు నిలబడి అతను కూడా కూర్చున్నాడు.

"మీ సంబంధం గురించి మధ్యవర్తి చెప్పినపుడు ధవళ మిమ్మల్ని చేసుకుంటానని పట్టుబట్టింది బాబూ! తను ఇష్టపడి చేసుకోవడం వల్లనే మేము కాదనలేక పోయాము."

అతని వైపు కొద్దిక్షణాలు చూసి చెప్పసాగింది. "మిమ్మల్ని చూస్తుంటే ఈ పెళ్ళి మీకు ఇష్టం లేదేమో అనిపిస్తోంది. కారణం తెలియదు"

ఆమె మాటలు వింటూ గుడికి వచ్చి వెళ్ళేవాళ్ళను చూస్తున్నాడతను.

"ధవళ మా అమ్మాయి అని చెప్పడం కాదు గాని తన మనస్సు చాలా మంచిది బాబూ! ఎన్నడూ ఎవ్వరినీ నొప్పించదు. తన మీద మీకేమైనా అపోహలున్నాయా?"

మాట్లాడలేదతను.

"పిల్లలను సవతి తల్లి సరిగా చూడలేదేమో అన్న అనుమానమా?!"

చప్పున ఆమె వైపు చూసి తలదించుకున్నాడతను.

విషయం గ్రహించిన ఆమె వదనంలో చిరు దరహాసం.

"అదే మీ భయమైతే మీరిక నిశ్చింతగా ఉండవచ్చు.. మీకు ఇన్నాళ్ళూ తెలియని నిజం ఒకటి చెప్పమంటారా! మీ గురించి తెలిసినపుడు మిమ్మల్నే పెళ్ళి చేసుకుంటానని ధవళ అన్నది. అప్పటికి తను మిమ్మల్ని అసలు చూడలేదు కూడా! ధవళ మీ వైపు ఎందుకు మొగ్గు చూపిందో మీకు తెలుసా! మీ కున్న ఆ పసిపాపే అందుకు కారణం. అమ్మలేని ఆ పాపను అమ్మగా లాలించుదామనే ధవళ మిమ్మల్ని ఇష్టపడింది."

అత్తగారి వైపు విభ్రమంగా చూస్తున్నాడతను.

"మళ్ళీ పెళ్ళి చేసుకోవడం మీకు ఎంత మాత్రం ఇష్టం లేదని నేను గ్రహించాను. క్రమంగా మీలో మార్పు వస్తుందని నన్ను నేను సరిపెట్టుకున్నాను. పెళ్ళైనప్పటి నుండి పాప ఆలనాపాలనతో ధవళ ఉత్సాహంగా ఉంటోందే కాని, గృహిణిగా ఆమె కళ్ళలో మెరుపు, ఆనందం నాకు కనిపించలేదు. అందుకే ఇపుడు మీతో వివరంగా మాట్లాడుతున్నాను. నాకు ఎన్నడూ గుర్తురాని ఒక నిజం చెప్పమంటారా?"

ఆమె గొంతులో కూతురి మీద మమకారం స్పష్టంగా కనిపిస్తోంది.

"ధవళ పుట్టిన రెండేళ్ళకు వాళ్ళ అమ్మచనిపోతే నేను రెండవభార్యగా, ధవళకు సవతి తల్లిగా ఆ ఇంట్లో అడుగు పెట్టాను. తను నా కన్న కూతురు కాకపోయినా అంత కంటే ఎక్కువ. నేను తనకు సవతి తల్లిని అన్న భావన నాకు ఎన్నడూ కలిగేది కాదు. ధవళను మురళిని సమానంగా పెంచాను. ధవళను ఆదరిస్తే మీ బిడ్డకు అన్యాయం జరుగుతుందేమో అన్న భయమే మీలో ఉంటే మనసులోకి ఇక ఎన్నడూ ఆ ఆలోచనే రానీయకండి. ధవళ మీ భార్యగా రావడం మీ పాప అదృష్టం, మీ అదృష్టం కూడాను. మీరు ఒప్పుకోకపోయినా ఇది నిజం."

నెమ్మదిగా, స్పష్టంగా చెప్పి మరో రెండు నిమిషాలు మౌనంగా కూర్చుని లేచిందామె. అతనూ లేచి ఆమె వెనుక నడిచాడు.

"వస్తాను బాబూ! రేపు ఆదివారమే కదా! ధవళను, పాపను తీసుకుని ఇంటికి రండి."

సరేనన్నట్టు తల ఊపాడు. ఆమె వెళ్ళిపోయింది. వెనక్కి వచ్చి అదే చెట్టు కింద అర్థగంట సేపు కూర్చున్నాడు. హేమ కళ్ళముందు కదలాడింది ఆమె తీపి గుర్తుగా చిన్నారి దీక్ష. ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే ధవళ. ఇంటికి చేరిన మనోహర్ ఆదృశ్యాన్ని అలాగే చూస్తూ గుమ్మం దగ్గర నిలబడ్డాడు. స్కూటర్ చప్పుడు కూడా గమనించకుండా హాలులో పాపతో కలసి ఆడుతూ నవ్వుతోంది ధవళ. కాస్సేపు ఆడాక 'ఇక చాలు' అంటూ పాపను ఎత్తుకొని గుండెలకు హత్తుకుంది ధవళ. చేతులు కడుక్కుని టేబిల్ మీద ఉన్న గిన్నెలోంచి అన్నం తీసి పాపకు తినిపించబోతూ గుమ్మం దగ్గర ఉన్న అతని వైపు చూసి పలకరింపుగా నవ్వింది.

దీక్ష గబగబా అతని దగ్గరకు వచ్చి చేతులు చాచింది ఎత్తుకోమన్నట్టుగా.

"అన్నం తినమ్మా! తర్వాత ఎత్తుకుంటాను" అన్నాడు.

పాప భోం చేశాక ఎత్తుకుని కబుర్లు చెబుతూ వచ్చీ రాని మాటలు చెబుతున్న పాపను ఆలకిస్తూ, ధవళ కూడా తిరుగుతున్నాడతను. అతని ధోరణి వింతగా, కొత్తగా కనిపిస్తోందామెకు.

తండ్రి భుజం మీద అలాగే నిద్రపోయింది పాప. మంచం మీద పడుకోబెట్టి పాపకు దుప్పటి కప్పాడు.

ఇద్దరి భోజనాలు అయ్యాక వంటిల్లు సర్ది వచ్చింది ధవళ. సోఫాలో కూర్చుని పాప ఫ్రాకు మీద ఎంబ్రాయిడరీ చేయసాగింది. మనోహర్‌కు బాధగా ఉంది - ఇన్నాళ్ళూ తన ప్రవర్తనతో, అనుమానపు చూపులతో ఆమె మనసును గాయపరచినందుకు. సంతోషంగా ఉంది - తన అపోహలు తొలగిపోయినందుకు.

"ధవళా! అయామ్ సో సారీ! నిన్ను చాలా హర్ట్ చేశాను కదూ! అయామ్ సారీ!" క్రింద కూర్చుని ఆమె ఒడిలో తల దాచుకున్నాడతను పసిపిల్లాడిలా. *